సామాన్యుడి గొంతుగా.. సామాజిక సమర వేదికగా..

# మన చౌరాస్తా



The Complete News way

మన చౌరాస్తా
Telugu News Channel

సంపుటి : 02 | సంచిక : 53 | ఎడిటర్ : ఉప్పలంచి నరేందర్ | మంగళవారం | 10.06.2025






2 లో

## జనగామలో ట్రైనీ కలెక్టర్ల సందడి

### మహిళలను కోటీశ్వరులను చేయడమే

# ప్రభుత్వ లక్ష్యం

- రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క
- బడి బాట, ఇందిరా మహిళా శక్తిపై వీడియో కాన్ఫరెన్స్

**జనగామ, మన చౌరాస్తా :** తెలంగాణ రాష్ట్రంలో కోటి మంది మహిళా సంఘాల మహిళలను కోటీశ్వరులను చేయాలని లక్ష్యంతో పలు కార్యక్రమాలు చేపడుతున్నామని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి దనసరి అనసూయ (సీతక్క) అన్నారు. సోమవారం హైదరాబాద్ నుంచి సిఎస్ కే.రామ కృష్ణా రావుతో కలిసి ఆమె బడి బాట, ఇందిరా మహిళా శక్తి కార్యక్రమాలపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో డి.ఆర్.డి.ఓ, డి.ఈ.ఓ ఇతర జిల్లా స్థాయి అధికారులతో కలిసి అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్ జిల్లా కలెక్టరేట్ నుంచి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ కోటి మంది మహిళలను కోటీశ్వరులు చేయాలని లక్ష్యంతో సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో అనేక కార్యక్రమాలు చేపట్టామని ఇందులో భాగంగా మహిళా సంఘాల ద్వారా పెట్రోల్ పంప్ లను ఏర్పాటు చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. జిల్లాలలో మహిళా సంఘాలకు పెట్రోల్ పంప్ ఏర్పాటుకు అనువైన స్థలాలను ఎంపిక చేయాలని, ఒక పెట్రోల్ పంప్ ఏర్పాటు వల్ల 10 కుటుంబాలు బాగు పడతాయని మంత్రి అధికారులను ఆదేశించారు. మహిళా సంఘాల ద్వారా రైస్ మిల్స్, సోలార్ విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్ల స్థాపన, ఆర్టీసీ కు అద్దె బస్సులు నడపడం వంటి అనేక కార్యక్రమాల అమలు చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. నవంబర్ నాటికి జిల్లాలో చేపట్టిన నూతన ఇందిరా మహిళా శక్తి భవనాలు పూర్తి చేయాలని ఈ మహిళా శక్తి భవనాలకు ముఖ్యమంత్రి చేతుల మీదుగా గత నవంబర్ మాసంలో శంకుస్థాపన చేసుకున్నామని, చాలా జిల్లాలో వీటి పురోగతి ఆశించిన స్థాయిలో లేదని అన్నారు. పంచాయతీరాజ్ శాఖ ఇంజనీర్ల సమన్వయం చేసుకుంటూ నిర్దేశించుకున్న గడువు లోపు పనులు పూర్తయ్యేలా చూడాలని అన్నారు.

మహిళా సంఘాల ద్వారా ప్రభుత్వ పాఠశాలలో చదివే పిల్లలకు ఏకరూప దుస్తులు కుట్టు పనులు వేగంగా జరిగాయని, దీనికి కృషి చేసిన ప్రతి ఒక్కరికి మంత్రి ధన్యవాదాలు తెలిపారు. జూన్ 12న పాఠశాలలో పునః ప్రారంభోత్సవం సందర్భంగా పండగ వాతావరణంలో పిల్లలకు ఏకరూప దుస్తులు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేయాలని మంత్రి ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాలల పునః ప్రారంభోత్సవం సందర్భంగా పారిశుధ్ధ్య నిర్వహణకు అధిక ప్రాధాన్యత కల్పించాలని అన్నారు. పాఠశాల పరిసరాలను పరిశుభ్రం చేయాలని పిచ్చి మొక్కలను పూర్తిస్థాయిలో తొలగించాలని, వర్షపు నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని అన్నారు. గ్రామీణ ప్రాంతాలు, గిరిజన ప్రాంతాల్లో మహిళలకు అవగాహన కల్పిస్తూ నూతన మహిళ సంఘాలను ఏర్పాటు చేయాలని, పేదరికం అధికంగా ఉండే ప్రాంతాలలో అవగాహన కల్పిస్తూ మహిళా గ్రూపుల వల్ల కలిగే బెనిఫిట్స్ పై అవగాహన కల్పించాలని అన్నారు. ప్రైవేట్ వడ్డీ వ్యాపారుల దగ్గర రుణాల కోసం మహిళలు పోయే దుస్థితి రాకుండా, జిల్లాలో పూర్తి స్థాయిలో నూతన మహిళా సంఘాలను తయారు చేసి మహిళలను గ్రూపు లలో చేర్పించాలని అన్నారు.మహిళా సంఘాల ద్వారా సోలార్ విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్ల ఏర్పాటు ప్రక్రియ గాంధీ జయంతి నాటికి పూర్తి చేయాలని అన్నారు. ప్రతి జిల్లాలో మహిళా సంఘాల ద్వారా విద్యుత్ ప్లాంట్ ఏర్పాటు కోసం సబ్ స్టేషన్ పరిధిలో 8 ఎకరాల అనువైన భూమి 10 రోజుల్లో గుర్తించాలని అన్నారు.


wanted

విలేకరులు కావలెను



మన చౌరాస్తా తెలుగు దినపత్రిక స్థాపించిన అనతి కాలంలోనే పాఠకుల విశేష ఆదరణ పొందుతూ డిజిటల్ మీడియా రంగంలో దూసుకెళ్తోంది. స్థానిక సమస్యలపై, రాజకీయ, ఎడ్యుకేషన్, ఆరోగ్యం, సినిమా వార్తలు అందిస్తూ అందరి మన్ననలు పొందుతూ ముందుకు సాగుతోంది. మా పత్రికలో పనిచేయుటకు అనుభవం, ఆసక్తి గల జిల్లా స్టాఫ్ రిపోర్టర్లు, మండల రిపోర్టర్లు కావలెను.. పూర్తి వివరాలకు ఈ కింది నంబర్లలో సంప్రదించగలరు.

manachourasta@gmail.com

8555800812 | 9676400812

సామాన్యుడి గొంతుగా.. సామాజిక సమర వేదికగా..

మన చౌరాస్తా

The Complete News way



## జిల్లాలో పర్యటించిన ట్రైనీ ఐఏఎస్‌లు

**జనగామ, మన చౌరాస్తా :** జనగామ జిల్లాలో ట్రైనీ ఐఏఎస్ అధికారుల బృందం ఉషా నేతృత్వంలో కొయ్యాడ ప్రణయ్, సౌరబ్ శర్మ, హరీష్ చౌదరి, క్యారలీన్, సలోని సోమవారం కలెక్టర్ కార్యాలయానికి చేరుకోగా అదనపు కలెక్టర్లు పింకేష్ కుమార్, రోహిత్ కుమార్ స్వాగతించారు. ఈ సందర్భంగా కార్యాలయంలో సమావేశమై జిల్లా ప్రధాన్యతాంశాలపై చర్చ నిర్వహించారు. అనంతరం జనగామ మండలంలోని పెంబర్తి కోఆపరేటివ్ సొసైటీ కార్యకలాపాలను అడిగి తెలుసుకున్నారు. వస్తువులను పరిశీలించారు. రఘునాథపల్లిలోని కన్యక పరమేశ్వరి దేవాలయాన్ని సందర్శించారు. ఆలయ విశిష్టతను అడిగి తెలుసుకున్నారు. వీరి వెంట లైజన్ అధికారులుగా జిల్లా మార్కెటింగ్ అధికారి నరేంద్ర, జిల్లా బీసీ అభివృద్ధి అధికారి రవీందర్ ఉన్నారు.







# ప్రజావాణికి దరఖాస్తుల వెల్లువ



**జనగామ, మన చౌరాస్తా :**

జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని ప్రధాన సమావేశ మందిరంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు సుహాసిని, హనుమాన్ నాయక్ లతో కలిసి జిల్లా అదనపు కలెక్టర్లు పింకేష్ కుమార్, రోహిత్ సింగ్ ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్లు వివిధ సమస్యల గురించి వినతులు ఇచ్చేందుకు వచ్చిన వారి నుంచి వివరాలను తెలుసుకొని, తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా 64 ఆర్జీలను వారు స్వీకరించారు. అదే విధంగా ప్రజల నుంచి స్వీకరించిన ఫిర్యాదుల పరిష్కారం కోసం అన్ని మండలాల సంబంధిత తహసీల్దార్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా తగిన చర్యలకు సూచనలు చేశారు. వచ్చిన దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి సారించాలని, వాటిని పెండింగ్ లో లేకుండా త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు.

జనగామ మండలండ పెంబర్తి గ్రామానికి చెందిన సంకటి పార్వతమ్మ తన 28 గుంటల వ్యవసాయ భూమికి సంబంధించి భూ రికార్డులను సవరించి, పట్టాదారు పాస్ బుక్ లు మంజూరు చేయగలరని కోరుతూ దరఖాస్తు చేసుకున్నారు.

లింగాలఘణపురం మండలం, నెల్లుట్ల గ్రామానికి చెందిన ఉప్పల సాగర్, తన సర్వే నంబర్ 234, 237, 238, 240, 241, 242, 243/A, 249, 250, 251, 257/A, 258, 260/A, 261, 262 భూములకు సంబంధించి ఆర్ఓఆర్ ప్రొసీడింగ్ లు, 1బి, 7బి రికార్డులు జారీ చేయాలని విన్నవిస్తూ దరఖాస్తు చేసుకున్నారు.

జనగామ మండలం వెంకీర్యాల గ్రామానికి చెందిన నీల సత్తమ్మ తన 29 గుంటల భూమిని తన అక్క కుమారుడు మోసం చేసి పట్టా చేయించుకొని, ఇబ్బందులు పెడుతున్నాడని, అటువంటి వారిపై చర్యలు తీసుకొని, తనకు తన భూమిని ఇప్పించి, న్యాయం చేయగలరని మనవి చేస్తూ ఆర్జీ ద్వారా కోరారు.

లింగాలఘనపురం మండలం కుందారం గ్రామానికి చెందిన సాయిలు తన 27 గుంటల భూమి, అలాగే 23 గుంటల భూమి డిజిటల్ పెండింగ్ లో ఉందని, వాటిని సవరించి, పీపీబిలో ప్రింటింగ్ ఇప్పించుట గురించి అర్జీ చేశారు.

తరిగొప్పుల మండలం, కనీలకుంట గ్రామానికి చెందిన కలకుంట్ల నర్సింహులు తన ఒక ఎకరం 20 గుంటల భూమిని కబ్జా చేయుటకు ప్రయత్నించడమే కాకుండా అక్రమ పద్ధతిలో అదనంగా భూమి రికార్డును నమోదు చేయించుకున్న వారిపై తగు చర్యలు తీసుకొని తమకు న్యాయం చేయాలని వినతిపత్రం సమర్పించనైనది.

ప్రజావాణి అనంతరం జిల్లా అదనపు కలెక్టర్లు పింకేష్ కుమార్, రోహిత్ సింగ్ జిల్లా అధికారులందరితో సమీక్షించారు.

ఈ సందర్భంగా అదనపు కలెక్టర్లు మాట్లాడుతూ.. సీఎం ప్రజావాణి అర్జీలను, జిల్లా ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి, సత్వరమే పరిష్కరించాలన్నారు. అదే విధంగా పెండింగ్ దరఖాస్తుల పరిష్కారంలో వేగం పెంచి, త్వరితగతిన పూర్తిచేయాలని సూచించారు. అదే విధంగా రేషన్ కార్డుదారులకు తెలియజేయునది ఏమనగా జూన్ మాసంలో మూడు నెలలకు సంబంధించి (జూన్, జులై, ఆగస్టు) రేషన్ బియ్యం సరఫరా చేయుటకు రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించడం జరిగిందని, ఈ మూడు నెలల రేషన్ బియ్యం ఈ నెల 30వ తేదీ వరకు ఇవ్వడం జరుగుతుందని, రేషన్ కార్డుదారులు ఈ విషయాన్ని గమనించాలని కోరారు.

ఈ ప్రజావాణిలో మునిసిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, డీపీవో స్వరూప, డీఏఓ రామారావు నాయక్, డీడబ్ల్యూఓ ఫ్లోరెన్స్, డీసీఎస్ఓ సరస్వతి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



## ఘనంగా హిందూ సామ్రాజ్య దినోత్సవం

**జనగామ, మన చౌరాస్తా :** హిందూ సామ్రాజ్య నిర్మాణకర్తగా ఛత్రపతి శివాజీ మహారాజ్ నిలుస్తారని, హిందువుల స్వేచ్ఛ, స్వాభిమానికి హిందూ సామ్రాజ్య దినోత్సవం ప్రతీక అని మోహనకృష్ణ భార్గవ అన్నారు. సోమవారం జనగామ జిల్లా కూడలిలోని శివాజీ చౌక్ వద్ద గల శివాజీ విగ్రహం వద్ద హిందూ సామ్రాజ్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. శివాజీ విగ్రహానికి పూలమాలలు సమర్పించి, వీర శివాజీ, భారత్ మాతాకీ జై అంటూ హిందూ ఏకతా నినాదాలు చేశారు. విశ్వహిందూ పరిషత్ ఉపాధ్యక్షులు పాశం శ్రీశైలం, సభ్యులు ఉల్లెంగుల రాజు, చిలువేరు హర్షవర్ధన్, కుందారపు బైరునాథ్, శ్రీనివాస్ రెడ్డి, సత్యం, రాఖేష్, మాస రాజు, అంబటి బాలరాజు, సంపత్ గౌడ్ తదితరులు పాల్గొని శివాజీ విగ్రహానికి పుష్పాలు సమర్పించారు. ఈ సందర్భంగా మోహనకృష్ణ మాట్లాడుతూ జ్యేష్ఠ మాస శుద్ధ త్రయోదశి రోజున శివాజీ మహారాజ్ క్షత్రియులందరికీ అధిపతిగా, హిందూ సామ్రాజ్య నిర్మాణ కర్తగా, సనాతన ధర్మ పరిరక్షకుడిగా, ఛత్రపతిగా బిరుదాంకితుడై పట్టాభిషిక్తుడు అయ్యారని గుర్తు చేశారు. నాటి నుంచి నేటి వరకు ప్రతీ సంవత్సరం ఈ తిథిని హిందూ సామ్రాజ్య దినోత్సవంగా జరుపుకుంటున్నామని అన్నారు. పాశం శ్రీశైలం మాట్లాడుతూ మన పూర్వీకుల పోరాటాలు, త్యాగాల ఫలితమే నేటికి హిందువుల ఉనికికి కారణమని, ఛత్రపతి శివాజీ మహారాజ్ హిందువులకు నిత్యస్మరణీయుడని, హిందూ సామ్రాజ్య నిర్మాణంలో ఆయన కృషిని కొనియాడారు. వారి స్ఫూర్తిగా హిందూ సమాజ నిర్మాణానికి కృషిచేయలని అన్నారు.



## ఇందిరమ్మ ఇంటి భూమి పూజ

రఘునాథపల్లి, మన చౌరాస్తా : రఘునాథపల్లి మండలం ఫతేషాపూర్‌లో ఇందిరమ్మ ఇల్లు భూమి పూజ చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ హయత్ అలీ, కో ఆప్షన్ నెంబర్ షబ్బీర్ మీయా, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నేతాజీ, గాజులపాటి మహేందర్, గ్రామ పార్టీ అధ్యక్షుడు గాజులపాటి వీరోజీ, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# సైకాలజీలో రాధకు డాక్టరేట్



**వరంగల్, మన చౌరాస్తా :** వరంగల్‌లోని లాల్ బహదూర్ శాస్త్రి బీఈడీ కళాశాలకు చెందిన సీనియర్ అధ్యాపకురాలు కె.రాధకు మధ్యప్రదేశ్ భోపాల్ కు చెందిన మానస సరోవర్ గ్లోబల్ యూనివర్సిటీ సైకాలజీ విభాగంలో డాక్టరేట్ ప్రదానం చేసింది. డాక్టర్ కె.రాధ 2021లో ప్రవేశ పరీక్ష రాసి మానస సరోవవర్ గ్లోబల్ యూనివర్సిటీలోని మనోవిజ్ఞాన శాస్త్ర విభాగంలో పీహెచ్‌డీలో ప్రవేశం పొందారు. అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ పి. రంజిత్ కుమార్ పర్యవేక్షణలో 'ఎఫికసీ ఆఫ్ కౌన్సిలింగ్ ఇంటర్ వెన్షన్ ఫర్ రెడ్యూసింగ్ సైకో సోషల్ ఇష్యూస్ విత్ స్పెషల్ రిఫరెన్స్ టు టీనేజర్స్' అనే అంశంపై సిద్ధాంత గ్రంథాన్ని విశ్వవిద్యాలయానికి సమర్పించారు. తన పరిశోధనలో పలు విషయాలను కనుగొన్నట్లు ఆమె పేర్కొన్నారు. కౌమార దశలో ఉన్న యువతకు ఆయా సందర్భాల్లో కౌన్సిలింగ్ అవసరం ఉంటుందని చెప్పారు. విద్యార్థుల మానసిక ఎదుగుదలకు, మానసిక ఒత్తిడి నియంత్రణకు కౌన్సిలింగ్ పాఠశాల స్థాయిలో అవసరమని పేర్కొన్నారు. భవిష్యత్తులో కౌన్సిలింగ్ అవసరార్థులకు ఎలాంటి లాభా పేక్ష లేకుండా ఉచితంగా కౌన్సిలింగ్ అండ్ గైడెన్స్ సేవా కార్యక్రమాలు చేపడతానని వివరించారు. డాక్టరేట్ అవార్డు పొందిన సందర్భంగా డాక్టర్ కె. రాధను ఉస్మానియా గ్రాడ్యుయేట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రొఫెసర్ గోపాలచారి, ప్రధాన కార్యదర్శి బిఎన్ రాజేశ్వర్, ఎల్బీ బీఈడీ కళాశాల చైర్మన్ బి.శ్యాంసుందర్, కళాశాల కరస్పాండెంట్ ప్రేమ్ కుమార్ రెడ్డి, కోశాధికారి డాక్టర్ సూర్య కుమార్, ఓజిఏ సభ్యులు ప్రొఫెసర్ బి. రాజ్ కుమార్, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ గుండు సుధారాణి, ప్రముఖ జ్యోతిష్య పండితుడు డాక్టర్ కాళేశ్వరం సుమన్ కుమార్ శర్మ, సీనియర్ కవి కోడం కుమారస్వామి, కళాశాల అధ్యాపకులు, బంధుమిత్రులు అభినందనలు తెలిపారు.





# రెవెన్యూ సదస్సులు పకడ్బందీగా నిర్వహించాలి



**జనగామ, మన చౌరాస్తా :** జిల్లాలో కొనసాగుతున్న భూభారతి సదస్సులు పకడ్బందీగా నిర్వహించాలని సీఎంఆర్ఓ ప్రాజెక్ట్ సీసీఎల్ఏ సెక్రటరీ మంద మకరందు అధికారులను ఆదేశించారు. సోమవారం జనగామ మండలం యశ్వంతపూర్‌లోని పాఠశాలలో ఏర్పాటు చేసిన భూభారతి రెవెన్యూ సదస్సు నిర్వహణ తీరును సెక్రెటరీ ఆర్డీవో గోపి రామ్ తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడారు. భూభారతి చట్టం తీసుకొచ్చింది రైతుల కోసమేనని రైతులు తప్పనిసరిగా వినియోగించుకోవాలని కోరారు. దరఖాస్తులను పరిశీలిస్తూ తెలియనివి ఉంటే అధికారులను అడిగి తెలుసుకోవాలని పొరపాట్లు చేయరాదన్నారు. భూభారతిలో రైతుల ప్రతి ఒక్క సమస్య పరిష్కరించడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఆర్డిఓ గోపిరామ్ తహసీల్దార్ హుస్సేన్, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# ముగిసిన వేసవి శిక్షణ శిబిరం

**జనగామ రూరల్, మన చౌరాస్తా :** వేసవి సందర్భంగా జనగామ మండలం చౌడారం గ్రామంలో నిర్వహించిన అథ్లెటిక్స్ ఉచిత శిక్షణ శిబిరం సోమవారంతో ముగిసింది. ఈ సందర్భంగా విద్యార్థులకు సర్టిఫికెట్ ప్రదానంలో సలేంద్రి శ్రీనివాస్ పాల్గొన్నారు. అనంతరం కోచ్ సురేష్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతి సంవత్సరం వేసవిలో ఉచిత శిక్షణ శిబిరం ఏర్పాటు చేస్తుందని తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని మెలకువలు నేర్చుకున్నారని తెలిపారు. యాసారపు ఆర్య రాష్ట్ర స్థాయి లాంగ్ జంప్ లో జనగామ జిల్లా తరపున పాల్గొన్నాడని తెలిపారు. ఆర్యను ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో పీఈటీ గంగశెట్టి మనోజ్ కుమార్, యాసారపు కరుణాకర్, కర్ల శ్రీకాంత్ రెడ్డి విద్యార్థులు పాల్గొన్నారు.



## రైతులకు ఇచ్చిన హామీలను
# వెంటనే నెరవేర్చాలి
### రైతు సంఘం నేత భూక్యా చందు నాయక్

**జనగామ, మన చౌరాస్తా :** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు ఇచ్చిన హామీలను పూర్తి స్థాయిలో అమలు చేయాలని, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 11,12వ తేదీన ఎమ్మార్వో ఆఫీసుల ఎదుట ధర్నాలో నిర్వహించనున్నట్టు తెలంగాణ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి భూక్యా చందు నాయక్ తెలిపారు. సోమవారం తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రాపర్తి సోమయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వం దేశ రైతాంగానికి ఇచ్చిన హామీల అమలు చేయాలని, అదేవిధంగా కనీస మద్దతు ధరలు స్వామినాథన్ కమిషన్ సిఫారసుల ప్రకారం సవరించాలని, రాష్ట్రంలో పెండింగ్లో ఉన్న రైతు భరోసా నిధులు తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రైతాంగానికి ఇచ్చిన ఈ కింద హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మంగ భీరయ్య మాచర్ల సారయ్య, రమావత్ మీట్యా నాయక్, జిల్లా కమిటీ సభ్యులు నక్క యాకయ్య బోడ రాములు, కర్రే రాములు సుధాకర్ పాల్గొన్నారు.

# బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించాలి



**జనగామ, మన చౌరాస్తా :** ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలను బలోపితం చేసి బాల కార్మికుల వ్యవస్థ నిర్మూలించాలని జనగామ అమ్మ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు మంతెన మణికుమార్, ముఖ్య సలహాదారుడు వంగ భీమ్ రాజు అన్నారు. 'విద్య నా హక్కు బాల కార్మికుల వ్యవస్థను అంతం చేద్దాం..' అనే నినాదంతో ముందుకు పోవాలని పిలుపునిచ్చారు. ఈ దేశం అభివృద్ధి చెందాలంటే నేటి బాలలే రేపటి భావి భారత పౌరులుగా తయారు కావాలంటే రాష్ట్ర ప్రభుత్వం బాల కార్మిక వ్యవస్థను రూపుమాపేందుకు ప్రత్యేకమైన చర్యలు చేపట్టాలన్నారు. బాలలు స్వేచ్ఛగా ఉండే వాతావరణాన్ని కల్పించాలని, ప్రతి చిన్న విషయానికి మందలించవద్దన్నారు. హోటళ్లు ఇటుక బట్టీలలో ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన కార్మికుల పిల్లల కోసం వర్క్ సైడ్ స్కూల్ ఇటుక బట్టి యజమానులు ఏర్పాటు చేయాలని, కార్మికుల పిల్లల ఆరోగ్యం కోసం జిల్లా యంత్రాంగం ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు.